www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 18 మే 2024
5 తిరుపతి



హింసాత్మక ఘటనలపై సిట్ ఏర్పాటు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సార్వత్రిక ఎన్నికల పోలింగ్, పోలింగ్ తరువాత రోజున రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన హింసాత్మక ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందం సిట్ ను ఏర్పాటు చేసింది. 13 మందితో కూడిన ఈ సిట్ బృందం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన హింసాత్మక ఘటనలు జరిగిన ప్రాంతాల్లో హింసకు కారణమైన అంశాలను విచారించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. సిట్ బృందానికి ఐపీఎస్ అధికారి వినీత్ బ్రిజ్ లాల్ సారథ్యం వహిస్తారని డిజిపి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏసీబీ ఎస్పీ రమాదేవి, ఏసీబీ అదనపు ఎస్పీ సౌమ్యలత, శ్రీకాకుళం ఏసీబీ డిఎస్పి రమణమూర్తి, సిఐడి డిఎస్పి పి. శ్రీనివాసులు, ఒంగోల్ ఎసిబి డిఎస్పి వల్లూరి శ్రీనివాసరావు, తిరుపతి ఏసీబీ డీఎస్పీ రవిమనోహరాచారి, గుంటూరు రేంజ్ లోని ఇన్‌స్పెక్టర్ వి భూషణం, ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకట్ రావు, ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, శ్రీనివాస్, ఒంగోలు పిటిసి ఇన్‌స్పెక్టర్ మోయిన్, అనంతపురం ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎన్. ప్రభాకర్, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ వంటి 13 మందితో సిట్ ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సిట్ బృందం రాష్ట్రంలో జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌ల పరిశీలనలో కేసులకు సంబంధించి మరిన్ని సెక్షన్లు జోడించడానికి అవసరమైతే నిర్ణయం తీసుకునే అధికారం కలిగి ఉంటుంది. కేసుల విచారణ అధికారులను ఇప్పటికే సేకరించిన ఆధారాల పరిశీలనలో అవసరమైతే కొత్త ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయడానికి ఆదేశాలు జారీ చేస్తారు. ఈ ప్రక్రియ అంతా రెండు రోజుల్లో ముగిసి పూర్తి నివేదికను భారత ఎన్నికల సంఘానికి సమర్పించనున్నారు.



బెట్టింగుల జోరు..!

● కోట్లల్లోనే పందేలు ● కుప్పం మెజార్టీపై ఫోకస్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గెలుపోటములపై బెట్టింగులు ఊపందుకున్నాయి. ఎన్నికలకు ముందు నుంచే బెట్టింగ్‌రాయుళ్ల పందేలు ప్రారంభమైనా, పోలింగ్ తరువాత ఎక్కువయ్యింది. తిరుపతి జిల్లాలో తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, చిత్తూరు జిల్లాలో చిత్తూరు, నగరి నియోజకవర్గాలపై పెద్దఎత్తున బెట్టింగులు నడుస్తుండటం గమనార్హం. కుప్పంలో చంద్రబాబునాయుడు సాధించబోయే మెజార్టీపైనా పందేలు నడుస్తున్నాయి. రాజంపేట పార్లమెంట్ స్థానంపైనా కాయ్‌రాజా కాయ్ అంటున్నారు. లక్షలు, కోట్లల్లోనే పందేలు పెద్దఎత్తున నడుస్తుండటం గమనార్హం. క్రికెట్ తరువాత రాజకీయాల్లోకి బెట్టింగులు ప్రవేశించాయి.

చిత్తూరు జిల్లాలో ఒక్క తిరుపతి నుంచే జనసేన బరిలో నిలిచింది. ఇక్కడ ఆ పార్టీ తరఫున ఆరణి శ్రీనివాసులు పోటీ చేశారు. వైసీపీ నుంచి భూమన కరుణాకర్ రెడ్డి తనయుడు అభినయ రెడ్డి మొదటిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఇక్కడ హోరాహోరీ పోరు నడిచింది. రెండు పార్టీల నేతలూ ఎవరికి వారు విజయంపై ధీమాగా ఉన్నారు. తిరుపతి అసెంబ్లీ పోలింగ్ కేవలం 60 శాతానికే పరిమితం కావడంతో మరింత ఉత్కంఠ పెరిగింది. మొత్తం రాయలసీమంతటా 75 శాతానికి పైగా పోలింగ్ నమోదవుగా ఒక్క తిరుపతిలోనే పోలింగ్ శాతం పడిపోయింది. దీంతో నరాలు తెగే టెన్షన్ రెండు పార్టీల నేతల్లోనూ కనిపిస్తోంది.

చంద్రగిరిలోనూ ఇదే ఉత్కంఠ కనిపిస్తోంది. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు మోహిత్ రెడ్డి వైసీపీ నుంచి బరిలో నిలవగా, టిడిపి తరఫున పులివర్తి నాని పోటీ చేస్తున్నారు. ఇక్కడ హోరాహోరీగా పోలింగ్ కొనసాగింది. చంద్రగిరి ఫలితం జిల్లా అంతటా ఆసక్తి కలిగిస్తోంది. దీంతో చంద్రగిరిలో గెలుపోటములపై జోరుగా బెట్టింగ్ కొనసాగుతోంది.

ఇక చంద్రబాబు నాయుడు పోటీ చేసిన కుప్పం విషయానికొస్తే ఇక్కడ రికార్డు స్థాయిలో 85శాతం పోలింగ్ నమోదయింది. చంద్రబాబు నాయుడు భారీ మెజారిటీతో ఇక్కడ విజయం సాధిస్తారని టిడిపి నేతలు ధీమాగా ఉన్నారు. అయితే కుప్పం వైసిపి నేతల్లోనూ గెలుపుపై ఇదే ధీమా కనిపిస్తోంది. మొత్తం మీద కుప్పంలో చంద్రబాబు నాయుడు సాధించే మెజారిటీపైనే ఎక్కువగా బెట్టింగ్‌లు నడుస్తున్నట్లు సమాచారం. చంద్రబాబు నాయుడుకు 50 వేలకు పైబడి మెజారిటీ వస్తుందని కొంతమంది పందెం కడుతుండగా, 30 వేలకు లోపే మెజారిటీ వస్తుందని మరి కొంతమంది పందేలు కాస్తున్నారు.

నగరి నియోజకవర్గ విషయంలోనూ ఇదే తరహాలో పందాలు కొనసాగుతున్నాయి. మరోసారి గెలిచి రోజా ఇక్కడ హ్యాట్రిక్ కొడుతుందని ఆ పార్టీ నేతలు ధీమాగా ఉండగా, రోజాకు ఘోర ఓటమి తప్పదని టిడిపి నేతలు గట్టిగా చెబుతున్నారు. నగరి రిజల్ట్ పై కూడా బెట్టింగ్లు నడుస్తున్నాయి. రాజంపేట పార్లమెంటు స్థానంపై కూడా ఇదే తరహాలో జోరుగా పందాలు నడుస్తున్నాయి. ఇక్కడ వైసిపి నుంచి పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి పోటీ చేస్తుండగా, కూటమి అభ్యర్థిగా బిజెపి నుంచి మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి బరిలో నిలిచారు. రాజంపేట పార్లమెంట్ స్థానం గెలుపోటములపైనా జోరుగా బెట్టింగులు నడుస్తున్నాయి.

మేం గెల్సి పొయ్యినాం.. మేం గెల్సి పొయ్యినాం..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఒరేయ్ శంకరా యాందిది ఇసిపిత్రంగా ఉండాది. అదేరా ఎలచ్చన్ అయిపొయ్యింది. ఎవురు గెలస్తారని పెజలు ఒకటే ఇదే పోతా ఉండారు. కాండేట్ల కన్నా టెన్సన్ పడతా ఉండారు. ఓళ్లు మాత్రం మేం గెల్సి పొయ్యినాం, మేం గెల్సి పొయ్యినాం అని అంటా ఉండారు. ఒకరు జెప్తే నిజమేనేమో అనుకుంటాం. పుసిక్కిమని ఇద్దరూ చెప్పేసిండ్ల. ఈ పేపరోళ్లు, గొట్టాల మీడియా ఓళు ఊరికే ఉంటారా. కాండేట్లని యాదో ఒకటి అడగతా ఉంటారు. ఓళ్లు తడుముకోకుండా చెప్తా ఉంటారు. ఏ ఇదంగా గెలస్తామని మాత్రం చెప్పక పోయే. ఒకే సోట ఇద్దరు ఎట్టా గెలస్తారని ఒకటే ఇదిగా ఉండాదిరా. నువ్వు జెప్పు ఎప్పుడైనా ఇన్నావా, సూసినావా. ఈళ్లేమో శానా ఇదిగా ఉండారు. కాండేట్లే అనుకుంటే నాయకులు గూడ అటనే అంతా ఉండారు. నామి నేసన్లు ఎయ్యక ముందు గెల్సి పొయ్యినాం అన్నారు. ఇప్పుడేమో గెల్సి పొయ్యినాం అంటా ఉండారు. 4 తేదీ దాక ఇటనే చెప్తా ఉంటారు. ఆ రోజు చెప్తారు జూడు. ఓడు అట్ట జేసినాడు, ఈడు ఇట్ట జేసినాడు అందుకే ఓడి పొయ్యినాను. ఓడి కత జూస్తాను, ఈడి అంతు జూస్తాను అంటారు చూస్తా ఉండు. గెలసినోడు కూడ ఓడి వల్ల ఆడ పొయ్యింది. ఈడి వల్ల ఈడ పొయ్యింది. మెజారిటీ తగ్గి పూడిసింది అంటా ఏలెత్తి సూపిస్తారు. ఓళ్ల వల్ల పోతే నోరు తెరవరు. ఎవురో ఒకరి మింద తోసేస్తా ఉండ. అప్పిటి దాక గెల్సి పొయ్యినాం అనుకోనీ...!!

మూడంచెల భద్రత

కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఈవిఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రతతోపాటు నిరంతర సిసిటివి పర్యవేక్షణ ఏర్పాట్లు చేశామని, మూడంచెల భద్రత ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. మూడంచెల భద్రతలో భాగంగా మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండవ అంచెలో ఆర్మ్ డ్ రిజర్వ్ పోలీసులు, మూడవ అంచెలో స్థానిక పోలీసులు 24 గంటలు పాటు రక్షణను పరిశీలించారు. శుక్రవారం ప్రవీణ్ కుమార్ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ఫోల్డ్ ఈవిఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూంల వద్ద ఏర్పాటుచేసిన భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ భద్రతా చర్యలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. 23-తిరుపతి(ఎస్ సి) పార్లమెంట్ నియోజక వర్గం, 7 అసెంబ్లీ నియోజక వర్గం ఈవిఎం స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. పరిశీలన అనంతరం సందర్శకుల పుస్తకంలో కలెక్టర్ సంతకం చేశారు. ఈవిఎంలు అమర్చిన సిసి కెమేరాలు దశ్యాలను సిసిటివి కంట్రోల్ రూమ్ నందు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు అదితి సింగ్, నిషాంత్ రెడ్డి, నరసింహులు, అదనపు ఎస్పీ కుల శేఖర్, డిఆర్ఓ పెంచల కిషోర్ పాల్గొన్నారు.



వ(హ)ర్షం..!

జిల్లావ్యాప్తంగా రైతుల్లో ఆనందం
నాట్లు వేసుకునేవారికి మంచిది
రెండోకారు పంటకూ ఉపయోగం

ప్రజాశక్తి - యంత్రాంగం

తిరుపతి, చిత్తూరు జిల్లాల వ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో వర్షం పడింది. మే నెల మొదటి పక్షంలో ఎండలు ఠారెత్తించాయి. పోలింగ్ రోజునా ఓటర్లు మండుటెండలో అల్లాడిపోయారు. రెండు మూడు రోజులుగా వాతావరణం చల్లబడి, అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి. ఆకాశం మేఘావృతమై ఆహ్లాదంగా కనిపించింది. తిరుపతి జిల్లా తూర్పు మండలాల్లో ఇప్పటికే నాట్లు నాటుతున్న రైతులకు ఈ వర్షం ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రెండో కారుగా వేరుశనగ వేసిన వారికి మంచిదేనని తెలిపారు. తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి, వెంకటగిరి నియోజకవర్గాల్లో పెద్దఎత్తున వర్షం కురిసింది.

డక్కిలి.. వెంకటగిరి, డక్కిలి సహా పరిసర ప్రాంతాల్లో శుక్రవారం అక్కడక్కడ వర్షం కురిసింది. ఉదయమంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది, సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సాగునీటి ఇబ్బంది ఎదుర్కొంటున్న నిమ్మ, మామిడి పండ్ల తోటలకు వర్షం ఊరటనిచ్చింది.

వెంకటగిరి రూరల్ : వరి సాగుకు సాగునీటి కోసం ఎదురుచూస్తున్న తరుణంలో మండల ప్రాంతాల్లో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రబీ పంట కోసిన అనంతరం కొంతమంది రైతులు సాగునీరు అనుకూలంగా ఉండే రెండో దఫా వరి పంటలు (1010) రకాలు వేయడానికి సన్నద్ధమవుతున్న తరుణంలో ఈ వర్షం ఎంతో ఓదార్పుగా నిలిచింది.


తిరుమలలో వర్షంలో భక్తులు

విమానం ఎక్కిన పేదింటి విద్యా కుసుమాలు



చెన్నయ్-హైదరాబాద్ విహారయాత్ర

ప్రజాశక్తి - సత్యవేడు

ప్రభుత్వ స్కూళ్లను ప్రోత్సహించడం తనవంతు బాధ్యతగా అనుకున్నారు సురుటుపల్లి ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ ఉమాపతి. మాదనంపాలెం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో 500 కంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారికి తన డబ్బులతో విమానం ఎక్కే అవకాశం కల్పిస్తానని ప్రకటించారు. హామీ మేరకు శుక్రవారం చెన్నయ్ నుంచి హైదరాబాద్‌కు నలుగురు విద్యార్థులను హెడ్‌మాస్టర్‌ను తోడుగా పంపారు. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో విహారయాత్ర చేసి ఆ పేదింటి విద్యా కుసుమాలు తిరిగి మాదనపాలెంకు రానున్నారు. విమానం కోరిక ఆ విద్యార్థుల దృష్టిలో చాలా పెద్దది.. అయితే సంకల్పంతో మంచి మార్కులు తెచ్చుకున్న ఆ విద్యార్థులకు ఉమాపతి మంచితనంతో కల నెరవేరింది.

సత్యవేడు మండలం చెరివి పంచాయతీ మాదన పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు విమాన ప్రయాణం ద్వారా విహారయాత్రలకు పంపుతానని ఉమాపతి హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం మంచి మార్కులు సాధించిన విద్యార్థులు శుక్రవారం చెన్నై నుంచి హైదరాబాదుకు విమానం ఎక్కారు.


రెండు రోజులపాటు అక్కడే..

మాదన పాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 500 కంటే ఎక్కువ మార్కులు సాధించిన పురుషోత్తం(552), వి. విష్ణు (515), మహా (509), తనుజ (505) లతోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముని మోహన్ చెన్నై విమానాశ్రయం నుంచి విమానంలో శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాదుకు చేరుకున్నారు. అక్కడ రెండు రోజులు పాటు వివిధ విద్యా సంస్థల విద్యా విధానాలను అధ్యయనం చేసి, విహార ప్రాంతాలను సందర్శించి తిరిగి తిరుపతికి చేరుకోనున్నారు. ఈ విహారయాత్రకు అయ్యే ఖర్చులను మాదనపాలెం కు చెందిన సురుటుపల్లి ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ ఉమాపతి పూర్తిగా భరిస్తున్నారు.. ఇచ్చిన మాట ప్రకారం పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఉల్లాసాన్ని విజ్ఞానాన్ని అందించి ప్రోత్సహించిన ఉమాపతి ప్రోత్సాహక తీరు ఇతరులకు ఆదర్శనీయంగా ఉందని స్థానికులు, ఉపాధ్యాయులు వెల్లడించారు.

తోటి వేషాల్లో గంగమ్మ భక్తులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర మూడో రోజైన శుక్రవారం తోటి వేషాలతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మే నెల వేసవి సెలవులు కావడంతో ఇటు చిన్న పిల్లలు, పెద్దలు తోటి వేషాలు వేసి నగరంలో పలుచోట్ల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యంగా రాజకీయ పార్టీ నేతలు తోటి వేషాలు వేయడంతో పాటు అమ్మవారిని దర్శించుకున్నారు భక్తులు తమ శరీరానికి బొగ్గును పూసుకుని, వేప ఆకులతో చేసిన దండను ధరిస్తారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు.



వైభవంగా శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో వివిధ సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలతో అలంకరించిన మండపంలో శుక్రవారం శ్రీపద్మావతి పరిణయోత్సవాలు శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. మే 19వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈఓ ఏవి ధర్మా రెడ్డి, శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, శ్వేత సంచాలకులు సుబ్రహ్మణ్యం రెడ్డి , డిప్యూటీ ఈఓ గుణ భూషణ రెడ్డి పాల్గొన్నారు. 1992వ సంవత్సరం నుంచి ఈ ఉత్సవం జరుగుతోంది. ఆనాటి నారాయణవనానికి ప్రతీకగా తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో శ్రీ పద్మావతీ పరిణయ వేడుకలు జరగడం విశేషం.

తిరుపతిలో కూటమి గెలుపు తథ్యం: సుగుణమ్మ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తిరుపతిలో కూటమి అభ్యర్థి (జనసేన) ఆరణి శ్రీనివాసులు గెలుపు తథ్యమని టిడిపి తిరుపతి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జ్ ఎం సుగుణమ్మ తెలిపారు. శుక్రవారం ఓ ప్రైవేట్ హోటల్లో టిడిపి విస్తతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుగుణమ్మ మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం కార్యకర్తలు సైనికుల్లా పోలింగ్ బూతుల వద్ద పని చేశారని, ఎమ్మెల్యే అభ్యర్థి ఆరని శ్రీనివాసులు గెలుస్తారని అన్నారు .వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతిలో ఎన్ని అరాచకాలు చేసినా ప్రజలు వారిని నమ్మలేదని, తిరుపతి ప్రశాంతతను భగ్నం కలిగించే విధంగా వైసిపి పాలన ఈ ఐదేళ్లు సాగించిందన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన మోహిత్ రెడ్డి టిడిపి శ్రేణులను భయభ్రాంతులకు గురి చేసినందుకు కుట్ర పన్నారని, ప్రజలు వారిని తిరస్కరించారన్నారు. వైసిపికి కొమ్ముగాసిన పోలీసు అధికారులపై ఎలక్షన్‌కమిషన్ చర్యలు తీసుకున్నా వారి తీరు మారలేదన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు చిన్నబాబు, దంపూరి భాస్కర్ యాదవ్, విజయలక్ష్మి, సూర సుధాకర్ రెడ్డి, అన్నా రామకష్ణ యాదవ్, బుల్లెట్ రమణ పాల్గొన్నారు

తూర్పు కనుమల్లో అరుదైన కప్ప

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తూర్పు కనుమ పలమనేరు కౌండిన్య అటవీ ప్రాంతం గౌనితిమ్మపల్లి వద్ద ఓ కుంటలో రెండు శతాబ్దాల క్రితం కనుమరుగైన శ్రీలంక గోల్డెన్ బ్యాక్డ్ ఫ్రాగ్ (శాస్త్రీయ నామం హైలా రానా గ్రాసిలిస్) అనే ఉభయచర జీవిని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డ్ కు చెందిన పరిశోధకులు ఈ కప్పను కనుగొన్నారు. ఈ కప్ప 1829 శ్రీలంకలో సాధారణ కప్పగా నమోదు చేయబడి ఉందని పరిశోధకులు తెలిపారు. తూర్పు కనుమల ప్రాంతంలో 27 ఉభయచరాలు ప్రస్తుతానికి కనుగొన్నామని, పశ్చిమ కనుమల్లో 253, భారతదేశంలో 454 ఉభయచరాలలో పోల్చి చూసామన్నారు. భారత ఉపఖండం నుండి ఇప్పటివరకు 19 గోల్డెన్ బ్యాక్ ఫ్రాగ్ లను గుర్తించబడ్డాయన్నారు. హైదరాబాదులోని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు డాక్టర్ దీప, జైస్వాల్, డాక్టర్ ఎస్ ఎస్ జాదవ్, డాక్టర్ కరుతపాండి, ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డ్ పరిశోధకురాలు కళ్యాణి కుంటే, పూణేలోని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధకులు కేపీ దినేష్ ల ప్రయత్నమే శ్రీలంక గోల్డెన్ బ్యాక్డ్ ఫ్రాగ్ మళ్లీ పునరావిష్కరణ జరిగిందన్నారు.



తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో..

ఒకేరోజు రెండు ప్రమాదాలు

స్వల్ప గాయాలతో బయట పడ్డ భక్తులు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల మొదటి ఘాట్ రోడ్డు మాల్వాడి గుండం వద్ద ప్రమాదం జరిగింది. శుక్రవారం మినీ వ్యాను బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, రోడ్డుపై పడ్డ మినీ వ్యాన్ నుండి డీజిల్ లీక్ అయ్యింది. డీజిల్ కారణంగా టీటీడీ వాటర్ ట్యాంకర్ స్కిడ్ అయ్యింది. వాటర్ ట్యాంకర్ రోడ్డుకు అడ్డంగా నిలబడిపోయింది. దీంతో ఘాట్ రోడ్డులో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలిసిన వెంటనే అధికారులు రంగంలోకి దిగారు.

తిరుమలకు నిత్యం వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. దేశం నలుమూలల నుంచి భక్తులు శ్రీవారి దర్శనానికి వస్తుంటారు. ఏడు కొండలపై కొలువైన స్వామిని దర్శించుకోవాలంటే ఘాట్ రోడ్డులో ప్రయాణం చేయాల్సిందే. అయితే ఘాట్ రోడ్ లో ప్రయాణం చేయాలంటే వాహనాలు నడిపే వారికి అనుభవం ఉండాలి. ఘాట్ రోడ్ లో అనేక మలుపులు ఉంటాయి. వాటి గురించి అవగాహన ఉండాలి. స్పీడ్‌ను కంట్రోల్ చేయగలగాలి. ఏ మాత్రం పట్టు తప్పినా ప్రమాదాల బారిన పడటం ఖాయం. ఘాట్ రోడ్డుల్లో అతి వేగం అత్యంత ప్రమాదకరం. అయితే, కొన్ని సార్లు డ్రైవర్లు స్పీడ్‌ని కంట్రోల్ చేయలేకపోతున్నారు. మలుపుల దగ్గర వాహనాన్ని అదుపు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. సాయంత్రం మరో ప్రమాదం జరిగింది. వెర్నా కారు అదుపుతప్పి డివైడర్ దాటి రాతి గుట్టపైకి చొచ్చుకు పోయింది. ఈ ప్రమాదంలో కూడా భక్తులు స్వల్పంగా గాయపడ్డారు.



కూటమికి 125-150 సీట్లు

శ్రీవారి సేవలో రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - తిరుమల

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు రావాలని కోరుకున్నానని, కూటమికి 125-150 సీట్లు తప్పకుండా వస్తాయని ఎంపి రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించారు. గురువారం చంద్రగిరి టిడిపి అభ్యర్థి పులివర్తి నానిని పరామర్శించిన ఆయన, శుక్రవారం తెల్లవారుజామున శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి అభిషేక సేవలో పాల్గొన్నారు. అర్చకులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల రఘురామకృష్ణం రాజు వైసిపి 25-40 సీట్లకే పరిమితమవుతుందన్నారు. తన మాట నిజం అవుతుందో, జగన్ మాట నిజమవుతుందో జూన్ 4న తెలుస్తుందన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి మంచి రోజులు రావాలని తాను శ్రీవారిని వేడుకున్నట్లు చెప్పారు.

ఎండల్లో హాయ్‌హాయ్...ముంజలతో ఎంజాయ్..!

ప్రజాశక్తి - డక్కిలి

ప్రకతి మనుషుల కోసమే అన్నట్టు ఎన్నోరకాల నోరూరించే ఫలాలను ప్రసాదించింది. వేసవిలో ఉపశమనం ఇచ్చే వాటిలో కొబ్బరికాయ, పుచ్చకాయ, తాటి కాయలు ముఖ్యమైనది. తాటి ముంజల సీజన్ వచ్చేసింది. సమ్మర్ సీజన్ వచ్చిందంటే చాలు తెల్లతెల్లటి తాటి ముంజలు ముత్యపు చిప్పల్లా మెరిసిపోతూ మనకు నోరూరిస్తాయి. చెప్పాలంటే కల్తీలేనివి, స్వచ్ఛమైన పండు ఏదైనా ఉందా అంటే.. అది తాటి ముంజలే అని చెప్పొచ్చు. తాటిముంజలు తినడం కూడా ఓ స్టైలే. పట్టణాలు, నగరాల్లో స్పూన్లు, ఫోర్కులతో తింటారు. కానీ, పల్లెల్లో అప్పటికప్పుడు తాటికాయ ఒలిచి బొటన వేలితో తీసుకుని తింటుంటే ఆ మజాయే వేరు. మానవ శరీరానికి ఎక్కువ మేలు చేసేవి తాటి ముంజలు. కేవలం వేసవిలో మాత్రమే ఇవి విరివిగా లభిస్తాయి. గ్రామాల్లో తాటిచెట్లు ఎక్కువగా ఉంటాయి కాబట్టి అక్కడ ముంజలు విరివిగా దొరుకుతుంటాయి. సిటిల్లో మాత్రం భారీ రేటు పెట్టి కొనుగోలు చేయాల్సిందే. గ్రామాల నుంచి అనేక మంది ఆటోల్లో తీసుకొచ్చి పట్టణాల్లో విక్రయిస్తుంటారు. దీంతో వారికి కొద్ది రోజులు ఉపాధి లభించడంతో పాటు పట్టణ వాసులకు అందుబాటులోకి తెచ్చినట్టవుతోంది.



నీటికుంటలో పడి బాలుడు మృతి

సోమల : మండలంలోని పేటూరు పంచాయతీ పొలికిమాకులపల్లి గ్రామానికి చెందిన మునిచేతన్ కుమార్‌రెడ్డి (7) బహిర్భూమికని గ్రామ సమీపంలోని నీటికుంట వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మృతిచెందాడు. తండ్రి జయరాంరెడ్డి, తల్లి మమత. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు. మృతిచెందిన బాలుడు రెండో కుమారుడు. మూడో తరగతి చదువుతూ ఉన్నాడు. ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.



20న 'చలో వెంకటగిరి'ని జయప్రదం చేయండి



చలో వెంకటగిరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దళిత, గిరిజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి -వెంకటగిరి: వెంకటగిరి పట్టణం క్రాస్‌రోడ్ సెంటర్‌లో వున్న అంబేద్కర్ విగ్రహాన్ని ఈ నెల12 వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 20వ తేదీన దళిత బహుజన ఆత్మగౌరవ పోరాట వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'చలో వెంకటగిరి'ని జయప్రదం చేయాలని దళిత, గిరిజన, బహుజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా డక్కిలి మండలంలో మాఘ గుంట, వెలికల్లు, ఈతేరి సముద్రం, మాధవయ్య పాలెం, దేవులపల్లి, అంబేద్కర్ నగర్, కపల్లె సంగనపల్లి, వివిధ గ్రామాలలో దళిత, గిరిజన, బహుజన ప్రజలు 'చలో వెంకటగిరి'ని జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతి సమాఖ్య కన్వీనర్ దండోల కిష్టయ్య, ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య, విడిఎస్ నాయకులు ఎస్ శంకర్, సంత సైనిక్ దళ్ నాయకులు కె కృష్ణ, ఎస్‌కె రఫీ పాల్గొన్నారు.



నీటి తొట్టెలను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-సోమల: గ్రామాలలో నివాసాల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ రెడ్డి అన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా సంజంపేట గ్రామంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మురికి కాలువలలో, ఇండ్లలో ఉండే తొట్టెలలో ఆబెట్ మందును వేసి లార్వాలు లేకుండా చూసుకోవాలని గృహ యజమానులకు సూచించారు. దోమలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ సాయంత్రం వేళల్లో ఇండ్లలో వేపాకు పొగ వేసుకొని దోమలు రాకుండా నియంత్రించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఓ అమర్నాథ్, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

శాంతికి భంగం కలిగిస్తే చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి-సోమల: ప్రశాంత పల్లెల్లో శాంతికి భంగం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని ఎస్ఐ వెంకట నరసింహులు హెచ్చరించారు. కక్షపూరిత చర్యలు, గొడవలు, ఘర్షణలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించనున్నట్లు స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని కందూరు, ఆవులపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడేంతవరకూ 144సెక్షన్, పోలీస్ 30యాక్ట్ అమల్లో ఉందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠినమైన కేసులు మోపడం జరుగుతుందని తేల్చిచెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఆవుల పల్లెలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

20న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: ఈనెల 20న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చౌడేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే శిబిరానికి చెన్నై నుంచి కంటి శస్త్ర చికిత్స వైద్య నిపుణులు రానున్నట్లు పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రేపటి నుంచి బూరగమందలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-సదుం: మండల పరిధిలోని బూరగమందలో టీటీడీ పరిధిలో వున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. శుక్రవారం ఆలయ అధికారులు మాట్లాడుతూ 19 నుంచి 28వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు వివరించారు. 19న ధ్వజారోహణం, 23న కళ్యాణోత్సవం, గరుడ వాహనం, 24న పుష్పపల్లకి, 27న చక్ర స్నానం, 28న పుష్ప యాగం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల కేంద్రంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు జిల్లా విద్యాశిక్షణా (డైట్)లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన వై.శ్రీరాములు మొదటి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు భార్య వై.రాజేశ్వరి మాట్లాడుతూ డైట్ కళాశాలలో జూనియర్ అసిస్టెంటుగా ఉత్తమ సేవలు అందించి అధికారుల చేత, కార్వేటినగరం గ్రామస్తుల వద్ద పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నారని ఆయన మృతి వారి కుటుంబానికి తీరనిలోటన్నారు. ఆయన జ్ఞాపకార్థం ప్రతి ఏడాది వృద్ధుల సేవా కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. ఈ క్రమంలో వృద్ధులకు పళ్ళు, స్వీట్లు, మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నారు. కార్యక్రమంలో శ్రీరాములు కుమారుడు నవీన్, కుమార్తెలు లోకే. హర్ష, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: యదమరి మండల కేంద్రంలో పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హైస్కూల్ ప్లస్‌గా ఈ సంవత్సరం నుండి అప్‌గ్రేడ్ అయింది. ఈ ఏడాది నుండి పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కోసం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరి రాజా, విద్యా కమిటీ చైర్మన్ రాజారెడ్డిలు తెలిపారు. ఈ సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫస్టియర్, ఎంపీసీ, బైపీసీలో అడ్మిషన్ కొరకు పాఠశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

దాడి చేసిన వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలి

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్



మాట్లాడుతున్న పాశం సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చిల్లకూరు మండలంలోని చింత వరం గ్రామంలో జలారి గోపాల్ పై దాడి చేయించిన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని దీనిపై ఎలక్షన్ కమిషన్ కి ఫిర్యాదు చేస్తామని గూడూరు నియోజక వర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు టిడిపి కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ చిల్లకూరు మండలం చింతవరంలో టిడిపికి మద్దతు ఇవ్వడాని జాలారి గోపాల్‌ను విచక్షణ రహితంగా దాడి చేశారని అతను ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఈ దాడికి కారణమైన వైసీపీ నాయకులపై సాధారణ సెక్షన్ కింద కేసు నమోదు చేశారని వారిపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కోరారు. తిరుపతి టిడిపి పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు నరసింహ యాదవ్ మాట్లాడుతూ ప్రశాంతంగా వున్న గూడూరు నియోజక వర్గంలో ఎన్నికలు అయిన అనంతరం వైసీపీ నాయకు లు ఇలా దాడులు చేయడం అమానుషమని వెంటనే దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలని ఎలక్షన్ కమిషన్ కి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు వెంకటేశ్వర రెడ్డి, బిల్లు చెంచు రామయ్య, పులిమి శ్రీనివాసులు,రహీం, ఉమాశంకర్, రవీంద్ర రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న రైల్వేగేటు

- వాహన రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని రైల్వే అధికారులు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణంలోని ఆర్‌డిఎం థియేటర్ వద్ద వున్న ఎల్‌సి నెంబరు 56 రైల్వేగేటు తరచూ మరమ్మతులకు గురవుతోంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. నెలకు రెండు, మూడు పర్యాయాలు గేటు మొరాయి స్తుండ డంతో రెండు, మూడు రోజుల పాటూ గేటును మూసివేస్తున్నారు. ఈ కారణంగా పుత్తూరు నుండి సత్యవేడు మార్గంలో వెళ్లే వాహనాలు రెండు కిలో మీటర్లు దూరంలోని మరాఠీ గేటు వద్దకు వెళ్లాల్సి వస్తోంది.ఆ గేటు వద్ద సైతం నగరి నుండి పుత్తూరుకు, పుత్తూరు నుండి నగరికి వెళ్లే వాహనాలతో పాటు సత్యవేడు మార్గంలో వెళ్లే వాహనాలు రావడంతో ట్రాఫిక్ స్తంభించి తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇటు సమయం వృథా కావడమే కాకుండా నాలుగు కిలోమీటర్లు అదనంగా ప్రయాణిం చాల్సి వస్తోందని వాహనదారులు వాపో తు న్నారు. రెండు రోజుల క్రితం ఓ లారీ గేటును లాక్కు వెళ్లడంతో గేట్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో రెండు రోజుల పాటు రాకపోకలను నిలిపి వేశారు. ఇలా నెలకు రెండు, మూడు దఫాలు మరమ్మ తులకు గురవుతు న్నాయి. సంబంధిత రైల్వే అధికారులు గేట్లకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. దీనిపై దృష్టి సారించడం లేదని వాహనదా రులు పేర్కొంటు న్నారు. నాణ్యమైన గేట్లను ఏర్పాటు చేసి మరమ్మతులు రాకుండా చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు.

అర్ధాంతరంగా ఆగిన తారు రోడ్డు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: నారాయణవనం మండల పరిధిలో గోవిందప్ప నాయుడు కండ్రిగ నుండి దిగువపుత్తూరు వెళ్లే రోడ్డు అర్ధాంతరంగా ఆగింది. గోవిందప్ప నాయుడు కండ్రిగ నుంచి పల్లెల మీదుగా పుత్తూరు నుండి బస్సు సౌకర్యం కల్పించేందుకు ఈ రోడ్డు ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. పదేళ్ల క్రితం ప్రారంభమైన రోడ్డు సుబ్బానాయుడు కండ్రిగ వద్ద తుంబూరు వరకు రెండు కిలోమీటర్ల మేర కొన్ని అభ్యంతరాల కారణంగా ఆగిపోయింది. మూడేళ్ల క్రితం ఈ రోడ్డు పనులు ఓ కాంట్రాక్టరు చేపట్టి మట్టి రోడ్డుపై కంకర పోసి వదిలిపెట్టాడు. తర్వాత అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షాలకు కంకర తేలి రోడ్డు గుంతల మయంగా మారింది. లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన ఈ రోడ్డుకు బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టరు అర్ధాంతరంగా నిలిపివేశాడు. ప్రస్తుతం ఈ మార్గంలో వెళ్లే వాహనాలు గుంతమయం కావడంతో ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి అర్ధాంతరంగా ఆగిన తారు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కంపా రాజేష్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆర్థిక శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థి కంపా రాజేష్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వియూ మాజీ రిజిస్ట్రార్, ఆర్థిక శాస్త్ర విశ్రాంత ఆచార్యులు మేడసాని దేవరాజులు మార్గదర్శకత్వంలో 'ట్రెండ్స్ అండ్ సప్లై రెస్పాన్స్ బిహేవియర్ ఆఫ్ మేజర్ ఫుడ్ అండ్ నాన్ ఫుడ్ క్రాప్స్ ఇన్ రాయలసీమ రీజియన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినట్లు పేర్కొన్నారు. ఇందుకు అతనికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. కంపా రాజేష్ పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్‌లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు వివరించారు. ప్రస్తుతం ఆయన తిరుపతిలోని ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఆర్థిక శాస్త్రం అధ్యాప కులుగా పనిచేస్తున్నారు. రాజేష్‌కు డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఓటు అటు..ఇటు..!

- అవగాహన లేక ఓటరు తికమక
- ఎవరికి వేశారో తెలియక నాయకుల అయోమయం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ఓటరు అవగాహన లేమితో తికమకతో ఓటు ఎవరికి వేశారో తెలియక నాయకులు అయోమయంలో పడ్డారు. నేతల అంచనాలు తలకిందులయ్యేలా వుందని జోరుగా చర్చించు కుంటున్నారు. ఎన్నికల సందర్భంగా భారీ ఎత్తున డబ్బులు, నజరానాలు, మద్యం పంపిణీ, బహుమతులు వెల్లువెత్తాయి. అవి పొందిన ఓటర్లు చాలా మంది సమన్యాయం పేరిట ఒక ఓటు అటు.. మరొకటి ఇటు వేశారన్న ప్రచారం (క్రాస్ ఓటింగ్) సాగిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో క్రాస్ ఓటింగ్ ఎవరికి చేటు తెస్తుందో తెలియక నాయకులు అయోమయ స్థితిలో తలలు పట్టుకుంటున్నారు. ముఖ్యంగా ఎన్నికల ప్రచారం చివరి ఘట్టంలో ప్రధాన పార్టీల ఎంపి, ఎంఎల్ఎ అభ్యర్థుల మధ్య సఖ్యత లేకపోవడంతో ఎవరికి వారు ఒక ఓటు తమకు వేసి మరొకటి మీ ఇష్టం' అంటూ ఓటర్లకు చెప్పడంతో పోలింగ్‌పై అవగాహన లేక ఓటర్లు అసలు తాము ఎంఎల్ఏ ఓటు ఎవరికి వేశామో.. ఎంపికి ఎవరికి ఓటు వేశామో తెలియక అయోమ యంలో పడ్డట్లు పలువురు తెలుపుతున్నారు. ఓటరు తికమక ప్రభావం ఎంపీ అభ్యర్థులపైన పడనుందా? లేక ఎంఎల్ఎ అభ్యర్థులపైనే పడనుందా..? అనేది తెలియాలంటే జూన్ 4వ తేదీ ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

బీపీ నివారణపై అవగాహన



సత్యవేడులో బిపి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి - సత్యవేడు: అధిక ఉప్పు, అనారోగ్యకర ఆహార పదార్థాలు తినడం వల్ల అధిక రక్తపోటుకు గురయ్యే ప్రమాదం వుందని దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ గుణశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం అధిక రక్తపోటు నివారణా దినోత్సవంను పురస్కరించుకొని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధిక రక్తపోటు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గుణశేఖర్ మాట్లాడుతూ అధిక రక్తపోటు వల్ల గుండెపోటు, కిడ్నీ సంబంధిత సమస్యలు తలెత్తుతాయన్నారు. రక్తపోటు తీవ్ర స్థాయిలో పెరిగినప్పుడు తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటుందన్నారు. రక్తపోటు సాధారణంగా 120/80 ఉండాలన్నారు. అధిక రక్తపోటు నియంత్రణకు పొటాషియం అధికంగా ఉండే ఆకుకూరలు, బంగాళాదుంపలు, అరటి పండ్లు వంటివి ఆహారంగా తీసుకో వాలన్నారు. ఉప్పును వీలైనంత వరకు ఆహారం తగ్గించుకుంటే హైబీపీ సమ స్య ఉత్పన్నం కాదన్నారు. దీంతోపాటు ప్రతిరోజు అర్ధగంట పాటు నడవడం, వ్యాయామం చేస్తే అధిక రక్తపోటును కంట్రోల్ చేసుకోవడానికి వీలుంటుం దన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు రోగు లకు బిపి పరీక్షలు నిర్వ హించి నివారణ చర్యల ను వివరించారు. ఈ కార్యక్ర మంలో పీహెచ్‌సి వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, ఎంపి హెచ్ ఈఓ సుబ్రహ్మ ణ్యం, హెడ్ నర్సులు పార్వతి, వనజాక్షి,హెల్త్ సూపరు వైజరు నాగజ్యోతి, ఫార్మసిస్ట్ భార్గవి, ల్యాబ్ టెక్నీషియన్ మురళీమోహన్, హెల్త్ అసిస్టెంట్ షణ్ముఖం, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



బుచ్చినాయుడు కండ్రిగలో

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తపోటు నివారణ దినోత్సవంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బుచ్చినాయుడు కండిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో రక్తపోటుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. రక్తపోటును నియంత్రణలో ఉంచుకోకపోతే హార్ట్ ఎటాక్, పెరాలసిస్ వచ్చే ప్రమాదం అధికంగా వుందని ప్రతి ఒక్కరూ రక్తపోటుని 104 వద్ద, పిహెచ్‌సి బుచ్చినాయుడు కండ్రిగలో, విలేజ్ హెల్త్ సెంటర్స్‌లో ప్రతి నెల పరీక్ష చేసుకొని తగిన మందులు వాడాలని సూచించారు. ఆహారంలో ఉప్పు తగ్గించుకుని తినాలని మందులు రెగ్యులర్‌గా వాడాలని డాక్టర్ ఆదేశాలు మేరకు వాడాలని సూచించారు. వ్యాయామం చేస్తూ ఆహారపు అలవాట్లు కూడా నియంత్రించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య అధికారి డిఎస్ వెంకటేశ్వర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సాగరమాల మృత్యుఘంటికలు..!

- ప్రమాదకరంగా చెరువులు- అధికారుల పర్యవేక్షణ లోపం



ప్రమాదకరంగా మారుతున్న చెరువు గుంతలు

ప్రజాశక్తి - ఓజిలి : సాగరమాల ప్రాజెక్టు పేరుతో చెరువులు మృత్యు పాశాలుగా మారుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తొలగింపులు సాగుతున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపాల డొల్లతనం కళ్ల ఎదుట సాక్ష్యంగా మారింది. చెరువుల్లోని మట్టి తొలగింపు కారణంగా నీటి పారుదలకు ఆటంకాలు ఏర్పడతాయని రైతులు గగ్గోలు పెడు తున్నారు. సాగరమాల ప్రాజెక్టు రహదారి నిర్మాణ పనుల నిమిత్తం ప్రభుత్వం కొన్ని ప్రదేశాల్లోని చెరువుల్లో ఉన్న మట్టిని తరలించడం కోసం షరతులతో కూడిన అనుమతులు ఇచ్చారు. అనుమతులు పొందిన గుత్తేదారులు ప్రభుత్వం అనుమతులను పెడచెవిన పెట్టి ఇష్టానుసారంగా అక్రమ మట్టి తరలింపులకు పాల్పడుతున్న సంబంధిత అధికారులు మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి . నిబంధనల ప్రకారం చెరువులోని మట్టిని రెండు లేక మూడు అడుగులు మాత్రమే తీయాల్సి ఉంది. అది కూడా నీటి పారుదలకు అనుకూలంగా ఉండేలా ఒకే స్థాయిలో మట్టిని తొలగించాల్సి ఉంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా సుమారు నాలుగు నుండి ఆరడుగుల వరకు మట్టిని తొలగించడంతో పెద్ద పెద్ద గుంటలుగా మారుతూ మృత్యు పాశాలుగా మారుతున్నాయి. దాహార్తి కోసం వెళ్లి మూగజీవాలతో పాటు ఈత కోసం వెళ్లే పిల్లలకు లోతు ప్రదేశాలు తెలియక మృత్యుఒడికి చేరే ప్రమాద ఘంటికలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

లేఔట్లకు అక్రమ మార్గంలో మట్టి తరలింపు

సాగరమాల ప్రాజెక్టు పేరుతో అనుమతులు పొందిన గుత్తేదారులు పరిమితికి మించి మట్టి తొలగింపులు చేపడుతూ అక్రమ మార్గాన లేఔట్లకు మట్టిని తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. సాగరమాల ప్రాజెక్టు పేరుతో అడ్డదారుల్లో మట్టిని తరలిస్తూ తమ జేబులు నిప్పుకుంటున్న గుత్తేదారులపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు మౌనంగా ఉండడంపై అర్థమేంటో అని ప్రజలు గుసగుసలాడుతున్నారు. సాగరమాల ప్రాజెక్టు పేరుతో అడ్డగోలుగా మట్టిని తరలిస్తున్న వారిపై ఉన్నత స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌టిసి అధికారుల నిర్లక్ష్యం

- కూలిన ప్రహరీ గోడలకు పునర్నిర్మాణాలు ఏవి
- కూలిన ప్రదేశంలో ముళ్లచెట్లతో కప్పివేత
- కోట్ల రూపాయల విడిభాగాలకు భద్రత ఏదీ?



నవంబర్ 28న ప్రహరీ గోడ కూలిన దృశ్యం (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజా రవాణా ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యానికి కోట్ల రూపాయలు విలువచేసే విడిభాగాలకు రక్షణ కరువైంది. మంగళం పరిధిలోని మంగళం ఆర్టీసీ డిపో ప్రహరీ గోడలు రెండు వైపులా కూలి నెలలు గడుస్తున్నా ఏమి పట్టనట్టుగా అధికారులు వ్యవహరించడం వారి ఉదాసీనతకు నిలువుటద్దం పడుతోంది. డిపోకు రెండు వైపులా రెండు గోడలు నెలల వ్యవధిలో 100 అడుగుల మేర కూలిపోయినా ఇప్పటి వరకు దాని మరమ్మతులకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

తిరుపతి-కరకంబాడి మార్గంలోని మంగళం ఆర్టీసీ డిపోను 9 ఏళ్ల క్రితం భారీ ప్రహరీ గోడను నిర్మించారు. గత ఏడాది గత ఆగస్టు మాసంలో కురిసిన వర్షాలకు ఆ నెల 27వ తేదీ తెల్లవారుజామున డిపోకు దక్షిణం వైపు ఉన్న ప్రహరీ గోడ డిపోలో చేరిన నీటి తీవ్రతకు తట్టుకోలేక 100 అడుగులకు పైగా కుప్ప కూలింది. అప్పట్లో అధికారులు వెంటనే పటిష్ట మైన చర్యలు చేపడతామని మీడియా కు తెలిపారు. తరువాత యధా విధిగా వారి నిస్సహాయతను ప్రదర్శిస్తూ పట్టలు కట్టి కాలాన్ని వెళ్లదీశారు.



గత ఆగస్టు 27న కూలిన దక్షిణ వైపు ప్రహరీ గోడ (ఫైల్ ఫోటో)

తర్వాత గత నవంబర్ 28వ తేదీ రాత్రి కురిసిన వర్షానికి ఉదయం 5 గంటల ప్రాంతంలో డిపోకు తూర్పు వైపుగా ఉన్న ప్రహరీ గోడ వంద అడుగుల మేర కూలిపోయింది. కూలిపోయిన సమయంలో డిపోలో బస్సులకు అమర్చే రిమ్ములు, టైర్లు, ఇతర సామగ్రి కొట్టుకుని ప్రధాన మార్గంకు చేరింది. పటిష్టమైన గోడను నిర్మించాల్సిన అధికారులు నాణ్యతలేని ప్రహరీ గోడలను నిర్మించడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికంగా పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు 'అదిగో ఇంజనీరింగ్ విభాగానికి లేఖ రాశాం... వారు వచ్చి అంచనాలు వేసుకుని త్వరలో కూలిన ప్రహరీ గోడ ప్రదేశంలో నూతన గోడ నిర్మాణం చేపడతారు..' అని డిపో మేనేజర్ తెలిపారు. అయినా నేటి వరకు ఆర్టీసీ అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోకుండా కోట్ల విలువైన బస్సుల మరమ్మతులకు ఉపయోగించే విడిభాగాలను గాలికి వదిలేశారు. ప్రస్తుతం దక్షిణం వైపున కూలిన ప్రహరీ గోడకు పట్టలు, తూర్పు వైపున కూలిన ప్రహరీ గోడకు ముళ్ళ కంపను అడ్డుపెట్టి భద్రతకు మమ అనిపించారు ఆర్టీసీ అధికారులు. తమ సొంత డిపో రక్షణకు చర్యలు తీసుకోక పోవ డం పై పలువురు పెదవి విరు స్తు న్నారు. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతా ధికారులు స్పందించి మంగళం డిపో ప్రహరీ గోడలను పునర్నిర్మించాల్సి ఉంది.



ప్రహరీ కూలిన చోట ముళ్ల చెట్లను అడ్డుగా పెట్టిన దృశ్యం

క్రైం న్యూస్

ముళ్ల పొదల్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి) : చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ కోనంగి వారి పల్లి రహదారికి పక్కన గల ముళ్లపొదల్లో ఓ గుర్తు తెలియని పురుషుని మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుని వయసు సుమారు 45 నుండి 50 సంవత్సరాల వరకు ఉంటుందని, మృతి చెంది సుమారు వారం అయి ఉండొచ్చని తెలిపారు. మృతదేహం నుండి దుర్వాసన వస్తోందని పోలీసులు తెలిపారు. మృతుని వివరాలు తెలియ రాలేదు. మృతుడు అధికంగా మద్యం సేవించి చనిపోయాడా? లేక ఎవరైనా చంపి అక్కడ పడవేశారా? అన్న అనుమానాలు కలిగిస్తున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి వైద్య కళాశాలకు తరలించారు. ఎస్ఐ అనిత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టిసి బస్సుఢీ

యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన మాతయ్య

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ఆర్‌టిసి బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘ టన మండలం లో శు క్రవారం చోటు చేసు కుంది. పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కనే ద్విచక్రవాహనంపై వెళుతున్న మాతయ్య (22)ను ఆర్టీసీ బస్సుఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పిచ్చాటూరు మండలం శివగిరి గ్రామానికి చెందిన మాతయ్యగా పోలీసులు గుర్తించారు. సత్యవేడు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు పిచ్చాటూరు నుండి శ్రీరామపురానికి వెళుతోంది. మార్గమధ్యంలో పిచ్చాటూరు పిహెచ్‌సి వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో మాతయ్య కిందపడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువకుని మృతితో శివగిరి గ్రామంలో యువకులు, గ్రామస్తులు, బంధుమిత్రులు, శోకసంద్రంలో మునిగారు.

పోలీసులకు ఇంటెలిజెన్స్ హెచ్చరిక

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



ఏపీలోని ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యం లో రాష్ట్ర నిఘా విభాగం కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఎన్నికల ఫలితాల(జూన్ 4) అనంతరం ప్రతీకార దాడులు జరిగే అవకాశం ఉందని తెలిపింది. పోలీసు బలగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.ఎపిఎస్‌పి బలగాలు పంపుతామని, అవసరమైతే కేంద్ర సాయుధ బలగాలు మోహరించాలని పేర్కొంది. ఈ మేరకు జిల్లాల ఎస్పీలకు ఆదేశాలు జారీ చేసింది.

అన్నదానం, ఉచిత వైద్యశిబిరం



ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి - పిచ్చా టూరు: పిచ్చాటూరు మండలం కీళపూడిలో ముత్యా లమ్మ కొలుపును నాగలాపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్ సునంద పద్మనాభ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా పాల పద్మనాభం మాట్లాడుతూ ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి అమ్మవారిని ఊరేగించారు. ముత్యాలమ్మ కొలుపు సందర్భంగా నాగలాపురం మార్కెట్ ఛైర్మన్ సునంద పద్మనాభం కుమార్తె డాక్టర్ వి దివ్య, అల్లుడు డాక్టర్ కిషోర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, అన్నదానం నిర్వహించారు. కీళపూడి గ్రామస్తులకు, చుట్టు పక్కల గ్రామ రోగుల కు మెరుగైన వైద్యం అందించారు.

రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు శుక్రవారం అన్నదానం చేశారు. దాతలు దొడ్డికాళ్ల లక్ష్మీదేవి, వెంకటరమణారెడ్డి (జగ్గారెడ్డి), వారి కుమారుడు బాల మురళిరెడ్డి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పి అన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు కోసం వితరణ చేయడం దాతలకు లభించే గొప్ప అవకాశం అన్నారు. ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, పాలక మండలి సభ్యులు భక్తులు పాల్గొన్నారు. అన్నదాత ఉభయ దారులకు ఆలయ కమిటీ ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

27 నుంచి శ్రీకల్యాణ వేంకటేశ్వరుని వార్షిక వసంతోత్సవాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక వసంతోత్సవాలు ఈ నెల 27వ తేదీ నుండి 29వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 8.30 గంటలకు ఉత్సవర్లు ఆలయం నుండి వసంత మండపానికి వేంచేపు చేస్తారు. తొలి రెండు రోజులు శ్రీవారు ఉభయనాంచారులతో కలిసి వసంతోత్సవంలో పాల్గొంటారు. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, సీతాలక్ష్మణ హనుమాన్ సమేత శ్రీరామచంద్రమూర్తి, రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివార్ల ఉత్సవమూర్తులను వసంత మండపానికి వేంచేపుగా తీసుకొచ్చి వేదపండితులు శాస్త్రోక్తంగా ఆస్థానం నిర్వహిస్తారు. వసంత రుతువులో లభించే పుష్పాలు, ఫలాలను స్వామికి సమర్పిస్తారు. 28వ తేదీ సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు ఊంజలసేవ, రాత్రి 7 నుండి 8 గంటల వరకు వీధి ఉత్సవం నిర్వహిస్తారు. గృహస్తులు(ఇద్దరు) ఒక రోజుకు రూ.516 చెల్లించి ఈ వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందిస్తారు.